TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 289 | బుధవారం జూన్ 25 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం

## 18 నెలల కాంగ్రెస్ పాలన గోల్డెన్ పీరియడ్



- రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంది
- కులగణనతో మోడీకి సవాల్ విసిరిన ఘనత మనదే
- నామినేటెడ్ పోస్టులు పొందిన వారు బాగా పనిచేయాలి
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని అధిష్టానం సూచిస్తుంది
- పార్టీ క్రమశిక్షణ తప్పిన వారిపై వేటుకు వెనకాడం
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

**హైదరాబాద్,జూన్24**

పదేళ్లపాటు తెలంగాలో కాంగ్రెస్‌దే అధికారమని, మరోమారు అధికారంలోకి తీసుకుని వచ్చేలా పార్టీనేతలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారు బాధ్యతలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత 18 నెలల కాంగ్రెస్ పాలన నిజంగానే గోల్డెన్ పీరియడ్ అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు.'మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం అని సీఎం అన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు.

2లో..




## సన్నధాన్యం రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్

- రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,జూన్24:**

కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు భీమా అందించామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం.




# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

- రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణ
- భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష
- పటిష్టాంగా ఏర్పాట్లు చేయాల మంత్రి పొన్నం సూచన

**హైదరాబాద్,జూన్**

చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా అత్యతం వైభవంగా చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి: మంత్రి శ్రీధర్‌బాబు




**హైదరాబాద్:**

తెలంగాణ-ఫ్రెంచ్ మధ్య ద్వైపాక్షిక సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రతినిధులతో శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలతలు, ప్రోత్సాహకాలను వివరించారు. ఫ్రెంచ్ కంపెనీలు ఇక్కడికొచ్చేలా చొరవ చూపాలని కోరారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, గతేడాది హైదరాబాద్‌లో 70 జీసీపీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. టీజీ ఐపాస్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

## పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు




**హైదరాబాద్:**

క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు.

# కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

## తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు వాంగ్మూలం

- నత్తనడకన సాగుతోన్న ట్యాపింగ్ కేసు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆరోపణ



**హైదరాబాద్,జూన్24:**

దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు.

మిగతాద్ది 2 లో

## విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

- రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాం: తుమ్మల



**హైదరాబాద్,జూన్24**

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళు_న్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు.

మిగతాది 2లో

## 'గోదావరి-బనకచర్ల'పై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు



**హైదరాబాద్:**

స్థానిక ఎన్నికల్లో తమ గెలుపుపై నమ్మకం లేక కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా వేసిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా విజయోత్సవ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్ విసరడంపై ఆయన స్పందించారు. "గతంలో రూ. 80వేల కోట్లు రైతుల అకౌంట్లలో కేసీఆర్ వేశారు. వ్యవసాయాన్ని పండుగలా చేసిన కేసీఆర్‌ను ఉరి తీయాలని మాట్లాడతారా? సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు క్షమించరు.

# సంపాదకీయం

## ఎవరి కోసం ఈ యుద్ధం?



అకారణ యుద్ధాలతో నిండా మునిగి, ఆర్థికంగా పతనావస్థకు చేరుకున్న అమెరికా, మరోసారి పశ్చిమాసియా రణరంగంలో దూకి తన మూర?త్వాన్ని చాటుకుంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 'నాకెందుకో నోబెల్ బహుమతి రావటం లేద'ని వగచి 48 గంటలు కాలేదు... తన యుద్ధోన్మాదాన్ని ప్రదర్శించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఇంటా బయటా 'వద్దుగాక వద్ద'ని మొత్తుకుంటున్నా, ఆంక్షలతో బక్కచిక్కిన ఇరాన్‌పై తన ప్రతాపాన్ని చూపారు.'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరిట శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్ కొండప్రాంతాల్లోని భూగర్భంలో వున్న ఫోర్డో, నతాంజ్, ఇసాఫన్ అణుస్థావరాలపై బంకర్ బస్టర్ బాంబులతో దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో అమెరికా చెబుతున్నట్టు ఆ స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయా లేదా అన్నది ఇంకా తెలియాల్సివుంది.కానీ ఫోర్డో కేంద్రంపై సోమవారం ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు మరోసారి దాడి చేశాయన్నది గమనిస్తే తీవ్ర నష్టం కలిగివుండొచ్చనిపిస్తోంది. ఇందుకు ప్రతిగా ఇరాన్ సైతం ఇజ్రాయెల్ నగరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఎన్నడూలేని విధంగా హెూర్ముజ్ జలసంధిని మూసేయాలని ఇరాన్ కేబినెట్ నిర్ణయించటం ప్రపంచ ఆర్థికవ్యవస్థపై పిడుగుపాటే.ఇరాన్‌పై అమెరికా పగ ఈనాటిది కాదు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం అనంతరం అమెరికా రాయబార కార్యాలయంపై దాడిచేసి 52 మంది దౌత్యవేత్తలనూ, పౌరులనూ 444 రోజుల పాటు బందీలుగా చేసిన వైనాన్ని ఆ దేశం మరిచిపోలేకపోతోంది. బందీలను విడిపించ టానికి అప్పటి అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ 'ఆపరేషన్ ఈగిల్ క్లా' సైతం విఫలమైంది. ఆ పరాభవంనుంచి కోలుకోలేక ఏదో సాకుతో ఆంక్షలు విధిస్తూనేవుంది. ఆ తర్వాత 1980లో అప్పటి ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను ఇరాన్‌పైకి ఉసిగొల్పింది. ఎనిమిదేళ్ల ఆ యుద్ధం రెండు దేశాలనూ దెబ్బతీయగా, అమెరికా ఆయుధ విక్రయంతో బాగుపడింది. అటుపై అడపా దడపా ఇజ్రాయెల్‌తో దాడులు చేయిస్తూనే ఉంది. కొత్త కొత్త ఆంక్షలతో ఇరాన్‌ను దెబ్బతీస్తూనే ఉంది. తీరికూర్చుని వేరే దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం, వనరుల కైంకర్యానికి ప్రయత్నించటం అమెరికా విదేశాంగ విధానంలో భాగం. ఇరాన్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన జాతీయవాది ప్రధాని మహమ్మద్ మొసాదిని 1953లో బ్రిటన్‌తో చేతులు కలిపి సైనికకుట్రతో కూల్చిన పాపం అమెరికాదే. అప్పట్లో బ్రిటన్ చేతుల్లోవున్న ఇరాన్ చమురు కంపెనీని జాతీయం చేయటంతో రెండు దేశాలూ ఈ దుస్సాహసానికి ఒడిగట్టాయి.అటుపై తమ కీలు బొమ్మ మహ మ్మద్ రెజా పెహ్లావీని అందలమెక్కించాయి. రెండు దశాబ్దాలు గడవకుండానే అతగాడు పదవీభ్ర ష్టుడయ్యాడు. ఇస్లామిక్ దేశాల్లో అమెరికా జోక్యంతో ఛాందసవాదుల ప్రాబల్యం పెరగటం 1953 నాటి ఇరాన్‌తో మొదలుపెట్టి ఇటీవలి బంగ్లాదేశ్ వరకూ కనబడుతూనే ఉంది. అఫ్గానిస్తాన్, ఇరాక్, లిబియా, లెబనాన్, సోమాలియా, సిరియా వగైరాలన్నీ ఇందుకుదాహరణ. అఫ్గాన్‌లో తాలిబన్‌లు మొదలుకొని సిరియాలో ఐఎస్ వరకూ అన్ని ఉగ్రవాద సంస్థల పుట్టుకకూ అమెరికాయే కారణం. డెమాక్రాట్లు మళ్లీ నెగ్గితే అమెరికాను సర్వనాశనం చేస్తారని, మూడో ప్రపంచయుద్ధానికి కారకు లవుతారని అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం చేసిన పెద్ద మనిషి ఇప్పుడు తానే ఆ పెను ముప్పు వైపు అడుగులేశారు. అమెరికన్ కాంగ్రెస్‌కు మాట మాత్రమైనా చెప్పలేదు. అంతర్జాతీయ చట్టాల్ని లేశమాత్రమైనా గౌరవించలేదు.చివరకు ఏమవుతుందోనన్న చింత అసలే లేదు. యుద్ధాల్ని ప్రారంభించటం తేలిక. వాటి ముగింపు ఎవరి వల్లా కాదు. వ్యక్తుల ఇష్టానిష్టాలకు అది లోబడి ఉండదు. అసలే పశ్చిమాసియా వైరుధ్యాల పుట్ట. పరస్పరం కలహించుకునే దేశాలు అక్కడ డజనుకు పైగా ఉంటాయి. అలాంటిచోట 'తగుదునమ్మా...' అంటూ ట్రంప్ వేలెట్టి పెద్ద తప్పు చేశారు. కానీ దీనికి మూల్యం చెల్లించుకోవాల్సింది... అమెరికన్ పౌరులూ, ప్రపంచ ప్రజానీకం.మూడున్నర దశాబ్దాల ఏలుబడిలో అలీ ఖమేనీకి ఇది పరీక్షా సమయం. దాడులకు లొంగి ట్రంప్‌తో దౌత్యానికి సిద్ధపడతారా లేక ఇజ్రాయెల్ అంతు చూసేదాకా వదలరా అన్నది తేలటానికి సమయం పడుతుంది. కానీ శక్తిమంతమైన అమెరికాపై ప్రతీకార దాడులకు దిగి భారీ నష్టానికి సిద్ధ పడకపోవచ్చు. అకారణ దాడులపై రౌద్రంగా ప్రకటనలిస్తున్నా ఆచరణ రూపం దాల్చక పోవచ్చు.అటు అమెరికా సైతం ఇరాన్ అణ్వాయుధ ప్రయత్నాలపై యుద్ధమే తప్ప ఆ దేశంపై యుద్ధం తమ ఉద్దేశం కాదంటోంది. కానీ ఇజ్రాయెల్, అమెరికాల ఉమ్మడి దురాలోచన ఇరాన్‌లో నాయకత్వ మార్పు... అమెరికా ప్రాపకంతో నడిచే ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వంటి ఆర్థిక సంస్థల ప్రమేయం లేకుండా సర్వస్వతంత్రంగా, నిటారుగా నిలబడగల్గిన ఇరాన్‌ను 'ప్రధాన స్రవంతి'కి మళ్లించటం.ఆ రెండూ మాత్రం నెరవేరే అవకాశం లేనే లేదు. ఇరాన్‌లో పెట్టుబడులు లేవు గనుక అమెరికా ఎంతకైనా తెగిస్తుంది. కానీ మనకు ఆ దేశంతో ఆర్థికబంధం ఉంది. పాకిస్తాన్ ప్రమేయం లేకుండా మధ్య ఆసియా దేశాలతో, అఫ్గాన్‌తో నేరుగా, చౌకగా వాణిజ్యాన్ని నెరపగలిగే చాబహార్ పోర్టు ఇరాన్‌లో నిర్మించింది మనమే. కానీ ఆంక్షల కారణంగా అది అరకొరగా ఉంది.ఇరాన్ చౌకగా ఇచ్చే చమురును కూడా ఆ ఆంక్షల పర్యవసానంగానే కాలదన్నుకున్నాం. ఈ యుద్ధం ఉగ్రరూపం దాలిస్తే ఆర్థికంగా మరింత నష్టపోతాం. చైనా, రష్యాల పరిస్థితి కూడా ఇదే. అటు నాటో కూటమి సైతం అయోమయంలో పడింది. అందుకే ఈ మతిమాలిన యుద్ధం చాలించమని ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలన్నిటిపైనా ఉంది.

# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

మొదటి పేజీ తరువాయి

అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండుసార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి, ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

మొదటి పేజీ తరువాయి

హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. 'భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.

## పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు

మొదటి పేజీ తరువాయి

సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఇవాళ్టికి (మంగళవారం)వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

మొదటి పేజీ తరువాయి

సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని స్పష్టం చేశారు. 'నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాల 25 ఎకరాల్లో.. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాంరాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బ్జడెట్లో 23,373 కోట్లు కేటాయించాం.' అని భట్టి వ్యాఖ్యానించారు.

## 'గోదావరి-బనకచర్ల'పై ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధం: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదైనా చర్చించేందుకు సిద్ధం. రేవంత్‌రెడ్డి ద్రోహాన్ని గణాంకాలతో సహా నిరూపిస్తాం"అని హరీశ్‌రావు అన్నారు.
పదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా ఉంటే.. ఏడాదిన్న కాంగ్రెస్ పాలనలో సాగు మళ్లీ దండగైందని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. "రూ.15వేలు రైతుభరోసా ఇస్తామని ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు దాన్ని రూ.12వేలకు కుదిండచం సంబరమా?రైతుభరోసా రెండు సార్లు ఎగ్గొట్టారు. ఓట్ల కోసం ఆగమేఘాల మీద డబ్బులు వేయడం సంబరమా?కాంగ్రెస్ మోసాలకు గుణపాఠం తప్పదు"అని అన్నారు.

## విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

మొదటి పేజీ తరువాయి

కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ.2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. రైతునేస్తం సభలో ఆయన మాట్లాడుతూ..తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్ఘాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజంగానే ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. 'వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ.9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం అని పేర్కొన్నారు.

## పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం




మొదటి పేజీ తరువాయి

ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది. తామే అభ్యర్థులమంటూ కొంతమంది తేల్చిచెబుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని చెప్పారు. అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని సీఎం ఆదేశించారు. ఏ ఎన్నిక జరిగినా ఒకే పక్రియ ప్రకారం అభ్యర్థి ఎంపిక ఉంటుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కూడా అదే పక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఇక.. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతోందని వారు చెప్పుకొచ్చారు. మరోవైపు నిన్న గాంధీ భవన్‌లో గొర్రెలతో నిరసన చేయడంపై సీఎం చాలా సీరియస్ అయ్యారు. గాంధీ భవన్‌లో ఇలాంటివి ఎంటర్ టైన్ చేయొద్దని ఆదేశించారు. నిరసనకు ఓ పరిమితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అందరి అభిప్రాయం తీసుకుంటుందని..
అందరినీ గౌరవిస్తుందన్నారు. ఇది పార్టీ ఆఫీసా ఇంకా ఏమైనానా అని గాంధీభవన్ ఆఫీస్ బేరర్స్‌ను ప్రశ్నించారు. ఇష్టా రీతిలో నిరసనలు చేస్తుంటే ఏం చేస్తున్నారు అని సీఎం ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం హెచ్చరించారు. అలాగే ఇంచార్జ్ మంత్రుల పనితీరుపై కూడా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే భాధ్యత ఇంచార్జ్ మంత్రులకు అప్పగించినా చేయడం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇంచార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల దగ్గర ఫండ్స్ పెట్టామని, వాటిని సరిగ్గా ఉపయో గించడం లేదని పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్, భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY
బుధవారం జూన్ 25 2025

# నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

**- నడిపల్లి సెంట్రల్ నర్సరీ తనిఖీ**

**కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24**
వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. డిచ్పల్లి మండలం నడిపల్లిలో నిర్వహిస్తున్న సెంట్రల్ నర్సరీని కలెక్టర్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రకాల మొక్కల పెంపకం తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మొలకెత్తిన మొక్కల శాతం ఎంత, ఎన్ని మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ కోసం మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన పెద్ద సైజు మొక్కలను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటి వాటిని సంరక్షించే చర్యలను పక్కాగా చేపడుతూ, ఉపాధి హామీ కూలీలను, గ్రామ పంచాయతీలను భాగస్వాములు చేయాలని సూచించారు. తద్వారా నాటిన మొక్కలు ఎక్కువ శాతం బతుకుతాయని, కూలీలకు గిట్టుబాటు వేతనాలు లభించడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈసారి 51.49 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. వనమహోత్సవం లక్ష్యానికి అనుగుణంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని అన్నారు. నర్సరీలలో మొలకెత్తని విత్తనాల స్థానంలో ఇతర మొక్కలు పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు.

**యానంపల్లి సహకార సంఘం గిడ్డంగి సందర్శన :-**
అంతకుముందు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి యానంపల్లి సహకార సంఘం గిడ్డంగిని సందర్శించారు. గోడౌన్ లో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్, ఈ.పాస్ వివరాలతో సరిపోయాయా అని తనిఖీ చేశారు. అన్ని వివరాలు, స్టాక్ సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రస్తుత వానాకాలం పంట సాగు కోసం సరిపడా యూరియా, ఇతర ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఎరువులు, విత్తనాల విషయంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో తగు చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ మేరకు జిల్లాకు సరిపడా ఎరువులు కేటాయించారని, ఇంకనూ అవసరమైన మేరకు ఎరువుల నిల్వలు సమకూర్చుకునేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తంగా ఉందన్నారు. ఎరువుల విషయంలో రైతులు ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ మేరకు రైతులలో నమ్మకం కలిగించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# బురద మాయంగా బస్టాండ్





**బోథ్ (మన వెలుగు) జూన్ 24 :**
అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో ఈ వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.అని మంగళవారం సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య అన్నారు. ఆర్టీసీ డి యమ్ మరియు అధికారులు స్పందించి ఇచ్చోడ బస్టాండ్ లో మొరం వేయించా లని.కోరారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని సమస్యలు పరిష్కరించాలని అన్నారు.ఆర్టీసీ బస్టాండ్ ఆవర ణలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ కార్య క్రమంలో నాయకులు పుక్కారెడ్డి అనిల్,అశోక్, ఇచ్చోడ సిపిఐ మండల నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# స్వేఛ్ఛ ను హరించడం దుర్మార్గం

**- మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్**



**జూబ్లీహిల్స్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**
రాజ్యాంగం కల్పించిన వ్యక్తి స్వేచ్ఛ హరించే అధికారం ఎవరికీ లేదు. దేశ భద్రత ప్రజల ప్రాణాలు తీసే వారి మీద పెట్టాల్సిన నిఘా మా మీద పెట్టారు. నేను నా భార్య మాట్లాడుకున్న మాటలు కూడా విన్నారు. సిగ్గుచేటు. ప్రభాకర్ రావు కి ఆదేశాలు ఇచ్చింది ఎవరో నిగ్గ తేల్చాలి. ఎస్ఐబి, ఇంటిలిజెన్స్ అన్నీ ముఖ్యమంత్రుల అధీనంలో ఉంటాయి. అప్పటి సీఎం కేసీఆర్ ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఇచ్చింది ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలి, చట్టప్రకారం శిక్ష పడేలా చేయాలి లేదంటే వారితో ఈ ప్రభుత్వం కుమ్మక్కయినట్టే అని భావించాల్సి ఉంటుంది. కాలయాపన చేస్తూ ఎవరికి లాభం చెస్తున్నారు. మీకు చేతకాకపోతే నిజాయితీగా సీబీఐకి అప్పగించండి వారు తేలుస్తారు. రాజ్యాంగం కల్పించిన వ్యక్తి స్వేచ్ఛ హరించే అధికారం ఎవరికీ లేదు. దేశ భద్రత ప్రజల ప్రాణాలు తీసే వారి మీద పెట్టాల్సిన నిఘా మా మీద పెట్టారు. నాయకుల వ్యక్తిగత సిబ్బంది, కుటుంబ సభ్యులు, గన్ మాన్ల ఫోన్ టాపింగ్ చేశారు. ప్రతి నిమిషం ఎక్కడ ఉన్నారు ఎవరితో మాట్లాడుతున్నారు అని నిఘా పెట్టారు. నేను ప్రభుత్వంలో ఉన్నప్పుడే 2018 లోనే నన్ను హుజురాబాద్ లో ఓడగొట్టేందుకు ప్రయత్నం చేశారు. 2021 లో హుజురాబాద్ ఉప ఎన్నికల్లో 6 నెలల కాలంపాటు ఎన్నికల ప్రచారంలో కూడా టాప్ చేసి నేను ఎవరితో మాట్లాడుతున్నానో తెలుసుకొని.. నాయకులను బెదిరించి, డబ్బులు, పదవులు ఆశ చూసి నన్ను ఓడగొట్టే ప్రయత్నం చేసారు. వందల ఆధారాలు చూపించారు. మా నాయకుల సంభాషణ కూడా వినిపించారు. గజ్వేల్, హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల్లో కూడా ప్రతిక్షణం ట్యాపింగ్ చేసారు. దమ్ము ధైర్యం లేనివాడు, నేరుగా యుద్ధం చేసే సత్తా లేనివాడు ఇలాంటి దుర్మార్గాలు చేస్తారు. నేను ఒక్కటే డిమాండ్ చేస్తున్న కాలయాపన చేయొద్దు. సంవత్సరం గడిచిపోయింది. అనేక కమీషన్లు వేశారు.. విద్యుత్తు కొనుగోళ్ళ మీద వేసిన కమీషన్ ఏమైందో తెలియదు. ఫోన్ టాపింగ్ కమీషన్, కాళేశ్వరం కమీషన్ రిపోర్ట్ ఇంకా రాలేదు. నాకు అనిపిస్తుంది ఈ ప్రభుత్వానికి నిజాయితీ ఉందా ? లేదా ? బిఆరెస్, బీజేపీ ఒకటే అని చెప్పే రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. లోపాయికారి ఒప్పందం లేకపోతే , లాలూచీ పడకపోతే ఎందుకు తూ తూ మంత్రంగా.. ఎందుకు నత్త నడకన ఈ ఎంక్వైరీ నడుస్తుంది. రిపోర్ట్ బయట ఎందుకు పెట్టడంలేదు. ఎందుకు భాద్యుల మీద చర్యలు తీసుకోవడం లేదు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి మీద ఉంది. ప్రభాకర్ రావు డైరెక్ట్ ఐపీఎస్ కాదు, ప్రమోటీ. కెసిఆర్ చుట్టరికమా, చెప్తే వింటాడనా ఎందుకు వేసుకున్నారు. చట్టానికి లోబడి పనిచేసే వారు కాదు నా ఇష్టానుకారం పనిచేసే వారు ఉండాలని నిబంధనలకు విరుద్ధంగా నియమించారు. రిటైర్ అయ్యాక కొనసాగించడం భాద్యత రాహిత్యం. కేంద్రం ఆదేశాలను తుంగలో తొక్కారు అనడానికి నిదర్శనం. గొప్ప వాడు అయితే సలహాదా రుగా పెట్టుకోవాలి తప్ప భాధ్యతయుతమైన పోస్టులో పెట్టవద్దు. ఒక ఐపీఎస్, ఐజీ స్థాయి అధికారి ఉండాల్సిన చోట అక్రమంగా నియమించారు. కీలకమైన రాష్ట్ర దేశ భవిష్యత్తుం కోసం పనిచేసే ఇంటెలిజెన్స్ సీఎం కనుసన్నల్లో ఉంటుంది. ఆ ఇంటెలిజెన్స్ చీఫ్ గా కూడా ప్రభాకర్ రావు ను అక్రమంగా నియమించారు. 9 నెలల పాటు పని చేయించారు. ప్రణీత్ రావు, భుజంగరావు, రాధ కిషన్ రావు అందరూ పైన అధికారుల ఆదేశాల మేరకు పనిచేశామంటున్నారు. సమాచారం సేకరించడం, పని అయ్యాక కాలబెట్టామని కూడా చెప్తున్నారు. స్వయంగా ప్రభాకర్ రావు చెప్పేది ఏంటంటే..నేను చెప్పిన వారివే కాక వేరే ఫోన్లు.. బిజినెస్ సినిమా రంగంలో ఉన్న వారివి కూడా టాప్ చేసినట్టు చెప్తున్నారు. ప్రజాస్వా మ్యంలో అత్యంత బాధాకరమైన అంశం ఒక రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్న ఇంద్రసేన రెడ్డి, జడ్జిల, మంత్రుల, ఏమ్మెల్యేల ఫోన్ టాప్ చేయడం దుర్మార్గం. పోలీసు అధికారుల ఫోన్ కూడా టాప్ చేశారట. 1975 లో ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి దేశాన్ని జైలుగా మార్చి కొంతమందిని అడ్రస్ లేకుండా చావగొట్టిన నల్ల చీకటి అధ్యాయా లు మళ్లీ ఈ రూపంలో కనిపిస్తున్నాయి. 50 ఏళ్లు గడిచింది ఎమర్జెన్సీ ముగిసి. ఫోన్ టాప్ చేసి అక్రమాలు దుర్మార్గాలు జరిపారు. ఈ విచారణ నత్తనడక కాకుండా, ఎవరి ఆదేశం మేరకు ఈ ప్రభాకర్ రావు పనిచేశారు. ఎందుకు ధ్వంసం చేశారు.

# నెట్ పరీక్ష సందర్భంగా అండర్ సెక్షన్ 163 అమలు

**- పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**
ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ యూజీసీ నెట్ జూన్ 2025 సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాదు డివిజన్ లోని పరీక్ష కేంద్రాం వద్ద ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మల్టి షిఫ్ట్ ప్రకారం పరీక్షలు ఉన్నాయని తెలిపారు. ఏవీ ఎంటర్ ప్రైజెస్, మున్నూరు కాపు సంఘం, అర్సపల్లి బై పాస్ రోడ్డు, నిజామాబాదు లో పరీక్షా కేంద్రాం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానిషేధిత ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమి కూడరాదు.నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరుగవద్దు.పరీక్షా కేంద్రా%శీ% పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్‌మూసివేయాలి.ఈ నిషేధిత ఆదేశాలు ఈనెల 29వరకు ఉంటాయని అన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో మహిళకే పెద్దపీట

**- మహిళలను కోటీశ్వర్లుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం**

**- కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన రూరల్ ఎమ్మెల్యే**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**
నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో మంగళవారం రోజున కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి మహిళా కోటీశ్వరులుగా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షిస్తున్నారని అన్నారు. 70 లక్షల మంది డ్రాక్వా గ్రూపులలో ఉన్నారని , వారికి రుణాలు ఇచ్చి, సోలార్ వంటి ప్లాంట్లను వ్యాపారం చేయడానికి ప్రోత్సహిస్తున్నమని అన్నారు. మహిళ లు బస్సులు కొనుక్కొని ఆర్టీసీలో అద్దెకు ఇవ్వాలని రుణాలు ఇస్తున్నామని అన్నారు. ఇందిరా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. మొత్తం 281 చెక్కులు మండల వారీగా సిరికొండ మండలం 44 చెక్కులు,ధర్పల్లి మండలం 73 చెక్కులు, డిచ్పల్లి మండలం 31 చెక్కులు,మోపాల మండలం 40 చెక్కులు,నిజామాబాద్ రూరల్ మండలం 49 చెక్కులు 2 కోట్ల 80 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ శేఖర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, యువజన నాయకులు ఉమ్మాజీ నరేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాలాజీ,సాయి రెడ్డి, అమృతపూర్ గంగాధర్,నవీన్ గౌడ్,పి ఎ సి ఎస్ చైర్మన్లు గోవర్ధన్, శ్రీనివాస్, శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాసుబాబు, శాంసన్, రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, చెక్కుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం దశాబ్దాల కల మురిసిన వేళ

**- తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ**

**- వ్యవసాయం దండగ కాదు పండగ**

**- రికార్డు స్థాయిలో నేరుగా రైతు ఖాతాలలో**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24**
తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతునేస్తం పై వీడియో కాన్ఫరెన్స్ ఉండడంతో ఇందల్వాయి రైతు వేదికలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో “వ్యవసాయం దండుగ కాదు పండుగ” చేయాలన్న ఆలోచన మేరకు ఇందిరమ్మ రాజ్యంలో సోనియమ్మ నాయకత్వంలో నేడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో రైతునేస్తం పథకాన్ని రైతుల ఖాతాలలో రికార్డు స్థాయిలో 9 రోజుల్లో పెట్టుబడి సాయంగా దాదాపు 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అభివృద్ధి అంటేనే ఇందిరమ్మ రాజ్యమన్నారు.రానున్న రోజులలో రైతులకు అన్ని విధాల కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పదేళ్లు పాలించినప్పటికీ రైతుల పట్ల చిన్నచూపు చూసిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానకే దక్కిందన్నారు.ప్రపంచం సైతం నేడు తెలంగాణ వైపు చూసేలా అభివృద్ధి జరుగుతుందన్నారు. నేడు ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నేడు రాష్ట్ర ప్రభుత్వం పండుగ వాతావరణంలో మండల కేంద్రాల్లో మరియు వివిధ క్లస్టర్లలో ఉన్న రైతువేదికల ద్వారా “రైతు నేస్తం” కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నా రు.రైతు భరోసా విడుదలకు తొలిరోజున ఏవిధంగా రైతు వేదికల ద్వారా లక్షలాది రైతుల సమక్షంలో కార్యక్రమాలు జరిపినట్టుగానే చివరి చెల్లింపు జరగడంతో రైతులలో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు.తెలంగాణ లో ప్రతి మహిళలను కోటేశ్వర్లు గా చేయడమే ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు ఇచ్చి , సోలార్ ప్లాంట్ వ్యాపారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్ ,ఐడిసీఎమ్ఎస్ ఛైర్మన్ తారచచంద్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్ , అమృతపూర్ గంగాధర్, గౌడ్,పీఎసిఎస్ ఛైర్మన్ చింతలపల్లి గోపీ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాసుబాబు, శ్యామ్ సన్, గ్రామశాఖఅధ్యక్షులు ఈర్ల సహెంధర్, నాయకులు మాజీ వైస్ ఎంపిపి ముత్తన్న,కడారి, వీరయ్య,కేపీ గంగారం,ఎంపిడిఓ అనంతరావు, తహాశీల్దార్, వెంకట్రావు, ఏవో శ్రీకాంత్,ఏఇవో ప్రకాష్ గౌడ్, పంచాయితీ కార్యదర్శి భరత్,అన్నిగ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిజామాబాద్ లో ఉత్సాహంగా రైతు సంబరం





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24**
నిజామాబాద్ జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో రైతు విజయోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. వానాకాలం ౨ 2025 సీజన్ కు సంబంధించి ముందస్తు పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా మంగళవారం రైతు సంబరాలు నిర్వహించారు.
జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల వద్దకు అన్నదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉత్సాహంగా ఈ సంబరాలలో పాల్గొన్నారు. రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం జమ చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రైతు వేదిక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ఎంతో ఆసక్తితో వీక్షించారు. డిచ్పల్లి మండలం యానంపల్లి రైతు వేదిక నుండి ఆదర్శ రైతులతో కలిసి కలెక్టర్ టి. విన య్ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధి కారి వీరాస్వామి, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, మండల వ్యవసాయ అధికారిణి మాధురి, సొసైటీల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 నాటికి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం

## రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు
## ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24**
వచ్చే ఆగస్టు 15 నాటికి భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామకృష్ణా రావు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ ద్వారా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ భాగస్వాములయ్యారు. వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. 2లక్షల 30 వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని సీ.ఎస్ అన్నారు. భారీ వర్షాలు కురియక ముందే ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ, సీనరేజీ ఛార్జీలను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంతవరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు.
కాగా, పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద రాష్ట్రానికి లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. ప్రతి జిల్లా పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు.
ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రొక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు.
రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.
లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు.
డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు. ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గొన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు.
గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే జిల్లాకు 19,490 ఇండ్లు కేటాయించగా, 15,834 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ ప్రొసీడింగ్స్ అందించామని, 7181 ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్ జరిగిందని, ప్రస్తుతం వివిధ దశలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తూ, లబ్ధిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అలాగే, జిల్లాలో 7075 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చెంగిచెర్లలో జులై 27న ప్రశాంతంగా బోనాల ఉత్సవాలు జరుపుకోవాలి

## కొత్త చెందర్ గౌడ్, కొత్త రవి గౌడ్



**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) జూన్ 24 :**
తెలంగాణలో అమ్మవారిని పూజించే ఉత్సవం బోనాల పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన గ్రామదేవతల పండుగిది.రాష్ట్ర పండుగ బోనాల జాతరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని చెంగిచెర్ల ముస్తాబవుతోంది. జులై 27న ఆదివారం బోనాల వేడుకలు జరుపుకొనుటకు గ్రామ పెద్దలు,మాజీ కార్పొరేటర్ కొత్త చెందర్ గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ భర్త, చెంగిచెర్ల గ్రామ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్, బోడుప్పల్ కార్పొరేషన్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త రవి గౌడ్,మాజీ క-ఆఫక్షన్ సభ్యులు రంగ బ్రాహ్మణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్ మరియు కుర్రి శివశంకర్, కొత్త శ్రీశైలం గౌడ్, కొత్త గోపాల్ గౌడ్,కొత్త విక్రమ్ గౌడ్, కుర్రి మహేష్, వివిధ కుల సంఘాల పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కాలనీల ప్రెసిడెంట్లు సెక్రటరీలు తదితరులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. అనంతరం కొత్త చెందర్ గౌడ్, కొత్త రవి గౌడ్ లు మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా భావించే మన బోనాల పండుగను చెంగిచెర్ల గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరారు.

# సమ్మె నోటీసు అందజేసిన మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**



జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మేనేజర్ కి జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై.ఓమయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ.రమేష్ బాబులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలు కోసం, కనీస పెన్షన్ 9వేల అమలు కోసం, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.హన్మండ్లు, రాధాకుమార్, భానుచందర్, డి.కిరణ్, ఎన్.రవికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామవేదమే శాంతికి మూలం



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ రెవెన్యూ శివారులో గల వైదిక ధ్యాన యోగ కేంద్రం ఆశ్రమంలో ప్రపంచ శాంతికై సామవేద పారాయణ మహా యజ్ఞాన్ని ఆశ్రమ వ్యవస్థాపకులు, వైదిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు,వేద పండితులు శ్రీశ్రీశ్రీ శ్రీధరానంద భారతీ స్వామి,ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, వైదిక పురోహితులు శ్రీశ్రీశ్రీ వేద పునీతానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో 10వ రోజు మంగళవారం అత్యంత శ్రద్ధాసక్తులతో సామవేద పారాయణ మహా యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీశ్రీశ్రీ శ్రీధరానంద భారతీ స్వామి, శ్రీశ్రీశ్రీ వేద పునీతానంద భారతీ స్వామీజీలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 4 వేదాల్లో రస ప్రధానమైనది సామవేదము. సామవేదము పరమాత్మ గుణగాన సంబంధమైనది. సామవేదం నుండే సంగీతం విస్తరించింది. భగవంతుని భక్తికి నిలయం కావాల్సిన సంగీతం అశ్లీల వర్ణనలకు ఆలవాలమైనదని వాపోయారు. మహర్షులు నిర్మల హృదయంతో సామగానం చేసి ప్రకృతిని అదుపులో పెట్టేవారు. తద్వారా సకాలంలో వర్షాలు కురిసేవి. క్రూర జంతువులు సైతం కలిసి మెలిసి ఉండేటట్లు చేసేవారు. సామగానంతో ఆనంద పరవశులను చేసేవారు. అటువంటి సంగీతము కలుషితమై ఈనాడు కేవలం రికార్డు డ్యాన్సులకు పరిమితమైంది. కావున మళ్లీ మనం భారతీయ పరంపరైన సామవేదాన్ని అధ్యయనం చేసి మనశ్శాంతిని, విశ్వశాంతిని పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మందం లక్ష్మీ భూమేశ్వర్, నడిపి గంగ సాయన్న దంపతులు, ఈశ్వర సాయి దంపతులు, కనికరం మధు దంపతులు, బద్దం రాజు భాయి నర్సారెడ్డి, కొమ్ముల ఎల్ఐసి గంగారెడ్డి దంపతులు, కొక్కు ప్రసాద్ దంపతులు, కంకణాల రాజేశ్వర్, పిట్టల సందీప్, ఆశ్రమ సేవకురాలు లక్ష్మి లతో పాటు నిజామాబాద్, నిర్మల్, ఆర్మూర్, అంకాపూర్ తదితర గ్రామాల నుండి విచ్చేసిన దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరుమీద ప్రతి ఒక్కరు మొక్కనాటాలి

## - ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**





భారతీయ జనతా పార్టీవ్యవస్థాపక అధ్యక్షులు శ్యామప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా దుబ్బ చౌరస్తాలో నిర్వహించిన మొక్కల పంపిణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొనడం జరిగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు జనసంఘ్ వ్యవస్థాపక స్థాపకులైన ముఖర్జీ దేశ సమగ్రత, ఐక్యత కోసం హిందువులలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడం ద్వారా జాతీయ పునరనిర్మాణం జరుగుతుందనే లక్ష్యంతో బీజేష్ స్థాపించడం జరిగిందన్నారు. జాతి ఐక్యతను ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకంచారని అన్నారు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే (ఒకే దేశానికి రెండు రాజ్యాంగలు, ఇద్దరు ప్రధానులు మరియు రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు )అన్నారు నరేంద్రమోదీ ముఖర్జి ఆశయాలకు, ఆకాంక్షాలకు అనుగుణంగా 370 ఆర్టికల్ రద్దుచేసి కాశ్మీర్ ను సుందరికరణ చేయడాన్ని మనం చూస్తున్నాం అన్నారు. ముఖర్జీ పార్టీ కోసం అహర్నిశలు శ్రామిస్తూ తన జీవితాన్నే అంకితం చేసి అతని మరణం కూడా నిర్భంధం లోనే ఒక మిస్టరీగా మిగిలిపోయిందన్నారు. ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్ జరుపుకుంటున్నాం అని తెలియజేసారు. బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు అమ్మపేరుమీద ఒక్క మొక్కను నాటలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే మొక్కలు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పంచ రెడ్డి ప్రవళిక ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, దుబ్బ మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఇంటలెక్చువల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కొండా ఆశన్న , తాజా మాజీ కార్పొరేటర్ మాస్టర్ శంకర్ , మహిళా మోర్చా మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ కే చెల్లింది



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 24**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని టి పి సి సి రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రైతు భరోసాను అందించి రైతులకు అండగా నిలిచారని ఈ ప్రభుత్వం రైతుల పట్ల నిరంతరం అన్ని విధాల కృషి చేస్తుందని అన్నారు. గత కొన్ని రోజులకు రైతులకు రుణమాఫీని అందించి తక్కువ కాలంలోనే రైతు భరోసా అందించడం రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని తెలిసేలా చేస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని ఆదుకోవడమే కాంగ్రెస్ పార్టీల క్షేమన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 24 :**
ఇచ్చిన హామీ మేరకు, రాష్ట్ర ప్రభుత్వం, రైతు భరోసా స్కీం ద్వారా రైతులకు వారి ఖాతాలలో డబ్బులు జమ చేయడం పట్ల, పట్టణంలో కాంగ్రెస్ పార్టీ-రైతు నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆర్టీసి డిపో ముందు గల, రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుని, పటాకులు పేల్చారు. తర్వాత, పట్టణ మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లింగం, అల్లూరి మహేంధర్ రెడ్డిలు మాట్లాడారు. మెట్పల్లి పట్టణం, మండలంలో మొత్తం 18వేల 72 మంది రైతులకు గానూ, 17కోట్ల 60లక్షల 97వేల 828 రూపాయలు రైతుల ఖాతాల్లో, రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినట్లు వారు తెలిపారు. అంతేగాక, రుణ మాఫీ, సన్నవడ్లకు బోనస్ చెల్లించడంతో, రైతులు సంతోషంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పట్టణ కిసాన్ సెల్ అధ్యక్షుడు కొమ్ముల సంతోష్ రెడ్డి, మెట్పల్లి సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ సర్పంచ్ లింగారెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు జెట్టి లక్ష్మణ్,సేవ దళ్ అధ్యక్షులు నాయిని సురేష,NSUI నాయకులు విజయ్,బొల్కం శివ,రైతు నాయకులు తుమ్మల లింగారెడ్డి,భూమారెడ్డి, రాజారెడ్డి, మహేందర్ జాకీర్, రాజగోపాల్,శంకర్ రమేష్ ,సూరి తదితరులు పాల్గొన్నారు

# కేంద్రీయ కార్యాలయం ప్రారంభోత్సవానికి కేంద్ర హోంమంత్రి అమిత్

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 24 :**
ఇందూరు జిల్లాకి పసుపు బోర్డు కేంద్రీయ కార్యాలయాన్ని ప్రకటించి ఈనెల 29వ తేదీన కేంద్రీయ కార్యాలయం ప్రారంభోత్సవానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా వస్తున్నారని ప్రారంభం అనంతరం రైతు సమ్మేళనం బహిరంగ సభలో పాల్గొంటారని నియోజకవర్గ రైతులు ప్రజలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని 40 సంవత్సరాల రైతుల చిరకాల కాంక్షనీ నెరవేర్చిన భారత దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ,కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాకి ఇందూరు పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి,జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి,కోరుట్ల నియోజకవర్గం రైతుల పక్షాన,ప్రజల పక్షాన, ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్.



# రైతన్న సంక్షేమానికి రేవంతన్న పెద్దపీట

## - ఒరుగంటి బిక్షమయ్య



**పినపాక (మన వెలుగు) జూన్ 24 :**
మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య ఆధ్వర్యంలో రైతు భరోసా విజయోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటేనే రైతు రాజ్యం అని, ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు సకాలంలో రైతు భరోసాను అందజేసింది కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ రాజ్యమని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసిన ఎంత రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికలలో ఇచ్చిన హామీలకి కట్టుబడి పనిచేస్తుందని ఏ ఒక్క హామీని కూడా విస్మరించబోదని అన్నారు.తెలంగాణ పథకాలు ఇతర రాష్ట్రాలను ఆకర్షిస్తున్నా యని ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయి రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించి రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లిపాక సొసైటీ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ, తూము రాఘవులు, అవుల రవి, బచ్చు వెంకటరమణ, కొండ బత్తుల ఉపేందర్, సత్యనారాయణ రెడ్డి, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, సామకూరి వెంకన్న, సంపత్, నరసింహ రావు , రామయ్య, సుబ్బారావు, జానపాటి నాగేశ్వరావు, కిలారి శేషగిరిరావు, బద్రు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**
చిన్నగూడూర్ మండలం కేంద్రంలోనీ దాశరథి సెంటర్ లో చిన్న గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మరబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి,రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శాసనసభ డిప్యూటీస్పీకర్ డాక్టర్ జె రామచంద్రునాయక్ ల చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలసి పాలాభిషేకం చేసారు ,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గునిగంటి కమలాకర్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రం ప్రభుత్వం ఆరు గ్యారెంటీ నిమిత్తం హామీ ఇచ్చిందో అట్టి హామీ ప్రకారం రైతులకు రుణమాఫీ 200 యూనిట్లు విద్యుత్, ఉచితముగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే అలాగే ఇందిరమ్మఆత్మీయ భరోసా ,ప్రభుత్వం చేపట్టి ప్రతిష్టాత్మమైన పథకం ఇందిరమ్మ ఇల్లు ,తెల్ల రేషన్ కార్డుకు సన్నబియ్యం అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిందని అలాగే రైతు భరోసా కార్యక్రమం 16వ తేదీ నుండి 24వ తేదీ వరకు రైతన్నలకు రైతు భరోసా పథకం కింద సుమారు తొమ్మిది వేల కోట్లకు పైబడి నేటి వరకు ఒక కోటి 44 లక్షల మంది రైతుల ఖాతాలో ఒక ఎకరం నుండి సుమారు 15 ఎకరాల వరకు రైతు భరోసా రైతన్నలకు నేరుగా రైతు ఖాతాలో జమ చేసిందని అన్నారు,ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు సుధగాని నాగేష్, పట్ల కిరణ్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుగులోత్ బిక్కు నాయక్, కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ ఆవుల బిక్షం, మైనారిటీ సెల్ అధ్యక్షులు జహంగిర్ పాషా,యూత్ మండల అధ్యక్షులు దాసరి రాజు యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపల్లి జీవన్,, మండల యూత్ నాయకులు జక్కుల మురళి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్, గంగాధరి ఉప్పల్లయ్య ,వాసం సుధాకర్, గంగారబోయిన శ్రీనివాస్,వెంకట్యా, మెగ్య నాయక్, భర్తపుపురం యాకన్న శ్రావణ్, దాసరి యాకన్న ,కాంచనపల్లి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు

# రైతుల అవసరాలకు సరిపడా అందుబాటులో ఎరువులు, విత్తనాలు

## - కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

## - ఎరువులు, విత్తన పంపిణీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 24 :**





ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. డిచ్పల్లి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రమైన గ్రోమోర్ సెంటర్ ను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్ లను, విత్తన బస్తాలపై లాట్ నంబర్, ఎం.ఆర్.పీ ధర, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి, కేంద్రం నిర్వాహకులకు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా ఎంత పరిమాణంలో ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి, ఎన్ని రోజులకు ఒకసారి స్టాక్ వస్తోంది అని కలెక్టర్ ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ లో, ఈ-పాస్ నమోదు వివరాలలో తేడా ఉండకూడదని అన్నారు. కాగా, జిల్లాలో జూన్, జూలై నెలలకు సరిపడా ఎరువులు, విత్తనాల నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా కొరత నెలకొనకుండా రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. అన్ని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువుల కారణంగా ఎక్కడ కూడా ఏ ఒక్క రైతు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. నకిలీ ఎరువులు, విత్తన విక్రయాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, తహసీల్దార్ సతీష్ రెడ్డి, మండల వ్యవసాయ

# ఇందిరానగర్ లో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులు

## అనుమతులు లేని అదనపు అంతస్తుల అక్రమ నిర్మాణాలు.
## మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు



**బంజారాహిల్స్ (మన వెలుగు) జూన్ 24 :**
బంజారా హిల్స్ పరిధిలోని ఇందిరానగర్ లో అక్రమ నిర్మాణాలు అధికారుల అండతో యాదేచ్చగా కొనసాగిస్తున్నారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ మామూళ్లకు కక్కుర్తి పడుతూ బాధ్యతలు మరిచిన అధికారులు సదరు అక్రమ నిర్మాణదారునికి సహకరిస్తుండగా యదేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు మించి అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నాడు. బాధ్యత కలిగిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా తమ జేబులు నింపుకుంటూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల వద్ద అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వారు ఈ అక్రమ నిర్మాణాల పై చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ అక్రమ నిర్మాణం వద్ద నుండి పెద్ద మొత్తంలో ముడుపులు అందాయని అందుకే వారు మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా ఉన్నట్టయితే ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చేయాలే తప్ప ఇలా అక్రమ సంపాదనకు పాల్పడడం హేయమైన చర్య అని ప్రజలు ఛీ కొడుతున్నారు. ప్రజలు కట్టిన పన్నులను లక్షల్లో వేతనాలుగా తీసుకుంటూ ప్రభుత్వం కోసం ప్రజల కోసం పనిచేయాలే తప్ప వ్యక్తిగత ఆదాయం కోసం పనిచేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు నిజంగా బాధ్యత కలిగిన అధికారులే అయితే తమపై ఉన్న మచ్చను తొలగించుకొని వెంటనే ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# స్థానిక సంస్థలు ఎన్నికలపై యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు భీరం రాజేష్

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 24 :**
మెట్ పల్లి పట్టణంలో సోమవారం రోజున స్థానిక సంస్థలు ఎన్నికలపై నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కోరుట్ల నియోజక వర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భీరం రాజేష్ పాల్గొన్నారు... ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భీరం రాజేష్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ముందుండి అత్యధిక స్థానాలు కైవసం చేసుకునే దిశగా అడుగులు వేయాలని తెలిపారు... యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి కీలకమని, పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.. రానున్న ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు పోటీ చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో సంప్రదింపులు జరిపి, యువజన కాంగ్రెస్ నాయకులను సర్పంచులుగా ఎంపీటీసీలుగా కౌన్సిలర్లుగా గెలిపించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు... కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం లో యూత్ కాంగ్రెస్ కి సమోచిత స్థానం కల్పించాలని, జగిత్యాల జిల్లాలోని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా మెట్పల్లి పట్టణంలో సమీక్ష సమావేశం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఇదేవిధంగా యూత్ కాంగ్రెస్ నాయకులు అందరూ సమిష్టిగా ముందుకు సాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రతి గ్రామంలో జెండా ఎగరవేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల రాహుల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కటకం చంద్రశేఖర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొడిమియాల దీపక్ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల గంగాధర్ మండల అధ్యక్షులు ఇంద్రాల హరీష్ మెట్పల్లి మండల అధ్యక్షుడు పుల్లూరివెంకటేష్ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు నల్లూరి సాగర్ మల్లాపూర్ మండల ఉపాధ్యక్షుడు బల్సాని ప్రణయ్ మండలాల ప్రధాన కార్యదర్శి కార్యదర్శి ఆల్ గౌట్ సాయికుమార్ సాయికుమర్ అబ్బ రాహుల్ కుంటాల వికాస్ మిట్టపల్లి భూమేష్ అఖిల్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు

# తోటి కార్మికుని కుటుంబానికి అండగా మెట్ పల్లి పెయింటర్స్ అండ్ పి ఓ పీ వర్కర్స్ యూనియన్

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 24 :**



పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మహమ్మద్ సమీ అను పెయింటర్ ఇటీవల ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ లో చనిపోగా మెట్ పల్లి డివిజన్ పెయింటర్స్ అండ్ పిఓపి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుని కుటుంబానికి సహాయంగా సంఘ అధ్యక్షుడు ఏశమేని గణేష్ ఆధ్వర్యంలో సంగసభ్యులతో కలిసి చనిపోయిన కార్మికుడు సమీ భార్యకు పదివేల రూపాయలను నగదు రూపంలో సహాయం అందించారు ఈ సందర్భంగా సమీ కొడుకు షాకిర్ మాట్లాడుతూ వారి కుటుంబానికి అండగా నిలబడి సహాయం చేసినందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏశమేని గణేష్,క్యాషియర్ మాతంగి శ్రవణ్, చిట్యాల శ్యామ్,కనుక లక్ష్మణ్, రేవాళ్ళ రాజన్న మద్దూరి శ్యామ్ సంగసభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భూమి పూజ కార్యక్రమం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బి. పరశురాం రెడ్డి



పరిగి మండలంలోని రూఫ్ ఖాన్ పేట్, మిట్ట కోడూర్, లక్నాపూర్, గోవిందా పూర్, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లకు ముగ్గు వేసి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసినా మార్కెట్ కమిటీ చైర్మన్ బి. పరశురాం రెడ్డి.ఈ కార్య క్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ట్రెజరర్ శశిధర్ రెడ్డి, పరిగి మండల ఉపాధ్యక్షులు ఆనందం, పరిగి మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు తౌరియా నాయక్, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, మనోహర్ రెడ్డి, పరివేద శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు అశోక్ , పాండు,కృష్ణ యాదయ్య, శ్రీనివాస్, రాజలింగం, జాంగిర్, అనంతయ్య, నరసింహులు, వెంకటయ్య సందీప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాని ధ్వంసం చేసిన దుండగులను విడిచి పెట్టరాదు: పోరాటాల రామన్న



కుల్కచర్ల మండలం పుట్టపాడు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు ఎవరని ఆ గ్రామంలోకి వెళ్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం బిసి సంఘాలతో కలిసి గ్రౌండ్ రిపోర్ట్ సేకరిస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు పరిగి కాంటెస్ట్ ఎమ్మెల్యే పోరాటాల రామన్న.. మహబూబ్ నగర్ బిఎస్పి పార్టీ కార్యదర్శి కృష్ణంరాజు , కులకచ్చర్ల అంబేద్కర్ యువజన సంఘం నాయకులు విదిగల బాబు,శివ నీ ఎల్లయ్య, శివని నరసింహులు, పుట్టపాడు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాములు, గ్రామ ఎస్సీ ఎస్టీ బీసీ ప్రజలు తో కలిసి జరిగిన విషయాన్ని క్షుణ్ణంగా పరిశీ లించాలని రిపోర్ట్ సేకరిస్తున్న ఉద్యమకారుడు.కొన్ని విషయాలు సంబంధిత ప్రభుత్వ అధికారులకు విన్నవించాలని సంఘం ఆధ్వర్యంలో నిర్ణయం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారిని ఆయన ఇచ్చిన ఫలాలను అనుభవిస్తూ ఇలాంటి దాడులకు పాల్పడుతున్నడం ఇంకా వివక్షత కొనసాగుతుందని ఐకమత్యం కాకుండా కొందరు కుట్రల వలన ఇలాంటివి ప్రజల మధ్యలో దేశ ఉద్దేశాలు పెంచడం కోసమే చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ అంబేద్కర్ సంఘ అధ్యక్షులు రాములు,మాజీ సర్పంచ్ జిల్లా వెంకటమ్మ వెంకట్ రాములు, యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మన్నెగుడా చౌరస్తా లో రైతు సంబరాలు



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతు నేస్తం రైతు సంబరాలు కార్యక్రమంలో భాగంగా పరిగి నియోజకవర్గ పూడూరు మండలం మన్నెగుడా చౌరస్తా లో రైతు సంబరాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిగి శాసనసభ్యులు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకంలో దూసుకుపోతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గండీడ్ మండల కేంద్రంలో రైతు భరోసా సంబరాలు

## గండేడ్ మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వానకాలం పంట పెట్టుబడి కోసం 9 రోజులలో 9000 కోట్ల రూపాయలతో రైతు భరోసా నిధులను రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం రైతు భరోసా సంబరాలను రైతులతో కలిసి గండీడ్ మండల కేంద్రంలో జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తిరుపతయ్య, భగవంతు రెడ్డి, కృష్ణయ్య,దుర్గా నాయక్, బసయ్య,మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.